నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: కాలనీలలో నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వెస్ట్ జోనల్ పరిధిలోని ఆర్సీపురం, పటాన్‌చెరు సర్కిల్‌లో బుధవారం ఆయన పర్యటించారు. రహదారులు, డ్రైనేజీ, రైతుబజార్, శ్మశాన వాటికలను పరిశీలించారు. రోడ్లను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ముంపు సమస్య రాకుండా నాలాల్లో పూడిక తీయాలని సూచించారు. చెరువులు కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ వేయాలని, బాక్స్ డ్రెయిన్ నాలాల నిర్మాణాలను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఎస్ఈ శంకర్, డీసీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్‌లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఇందిరానగర్‌లో ఆయన పర్యటించారు. త్వరలో సీసీ రోడ్డు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వీరేశంగౌడ్, అఫ్జల్, సయ్యద్ నయామ్, రాజన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని సిటిజన్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో క్లిష్టమైన అత్యవసర న్యూరో సర్జరీ ద్వారా ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడారు డాక్టర్లు. అతనికి రోజు 5, 6 సార్లు మూర్ఛ రావడం, కుడి ఎగువ, దిగువ అవయవాలు బలహీనంగా ఉండటం, మాటను అర్థం చేసుకోలేకపోవడం వంటి లక్షణాలతో హాస్పిటల్‌లో చేరారు. అతనిని పరీక్షించిన న్యూరో సర్జన్ రాజేష్‌రెడ్డి సన్నారెడ్డి వెంటనే ఫ్రంటో టెంపోరోపారిటల్ డి కంప్రెసివ్ క్రానెక్టమీ శస్త్ర చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ కొవిడ్ అనంతరం ఆందోళనకరంగా మారిన ధోరణిని వివరించారు. కొవిడ్–19 ఇన్‌ఫెక్షన్ల తరువాత వీన్ థ్రాంబోసిస్ కేసులు పెరుగుతున్నాయని వెల్లడించారు. సిటిజన్ హాస్పిటల్ ఆర్ సీఓఓ డాక్టర్ ప్రభాకర్ సత్వరమే స్పందించిన వైద్యులను అభినందించారు.

జాతీయ రహదారి.. మురుగు తిప్పలు

పట్టించుకోని అధికారులు • ఏళ్లు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు లేదు



మదీనాగూడ జాతీయ రహదారిపై పారుతున్న మురుగు నీరు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్ కమాన్ ఎదుట ఉన్న నాలా నుంచి మురుగు పొంగిపొర్లుతుంది. జాతీయ రహదారిపై మురుగు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వాహనదారులు మురుగులో నుంచే పోతున్నారు. ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రులు ఉన్నాయి. రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ప్రజలు దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు. ఈర్ల



రామకృష్ణనగర్ ముఖద్వారం ఎదుట నాలా నుంచి పొంగుతున్న మురుగు నీరు



చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ జాతీయ రహదారి వరకు సుమారు రూ.15 కోట్లతో 2.4 కిలో మీటర్ల పొడవు నాలా పనులు పూర్తయ్యాయి. కానీ నాలా కల్వర్టులోకి ఈ మురుగు కాలువను కలపడంలో జాప్యం జరుగుతుండడంతో పలు కాలనీలవాసులకు, ఆసుపత్రులకు వచ్చే వారు మురుగులో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఈర్ల చెరువు నుంచి వైశాలీనగర్, వినాయక నగర్, మదీనాగూడ, రామకృష్ణనగర్ జాతీయ రహదారి వరకు సుమారు 2.4 కిలోమీటర్ల నాలా కల్వర్టును నిర్మించారు. ఇది దీప్తిశ్రీనగర్ నుంచి గంగారం పెద్ద చెరువులోకి కలుస్తుంది.

ఏళ్ల తరబడి..



మదీనాగూడ రామకృష్ణనగర్ ముఖద్వారం వద్ద నాలా కాలువ నుంచి మురుగు నీరు పొంగుతోంది. సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే అధికారి కరువయ్యారు. ఇప్పటికైన అధికారులు పొంగుతున్న మురుగునీటి సమస్య పరిష్కరించాలి. – మల్లేష్, రామకృష్ణనగర్

కాలువలో చెత్త చెదారాన్ని తొలగించాలి



రామకృష్ణనగర్ కమాన్ ముందు నాలా కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని పారిశుధ్య సిబ్బంది తొలగించి మురుగు నీరు సాఫీగా వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలి. రోడ్డుపై పారుతున్న మురుగు నీరు సమస్యను శాశ్వత పరిష్కారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. – రవి, మదీనాగూడ

- నాలా కల్వర్టు పనులు పూర్తి అయినప్పటికి పొంగుతున్న నాలా కాలువను కల్వర్టులోకి కలపకపోవడంతో కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- జీహెచ్ఎంసీ అధికారులు మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వారితో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లితండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు మహేష్, నర్సింహ, సిద్దు బుధవారం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.గంగాధర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పలువురు పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతునాయక్, శేఖర్, ప్రభాకర్, మన్నేరమేష్, ప్రసాద్, మహేష్, నర్సింహ, ప్రసాద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంల పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. సురభి కాలనీలోని ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బుధవారం యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదవాలని సూచించారు.అనంతరం స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్లే ఏరియాను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌రావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వీరేశం గౌడ్, దేవదాసు, స్కూల్ కమిటీ అధ్యక్షులు బసవరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ శ్రీకళ, నాయకులు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు



తనిఖీలు నిర్వహిస్తున్న అడిషనల్ డీసీపీ వీరన్న

మియాపూర్: మద్యం సేవించి వాహనాలను నడపరాదని, పట్టుబడితే చర్యలు తప్పవని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న తెలిపారు. మియాపూర్‌లోని బొల్లారం క్రాస్ రోడ్డు సమీపంలోని బస్టాప్ వద్ద మంగళవారం రాత్రి ట్రావెల్స్ బస్సు డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వైజాగ్ వెళ్తున్న మారుతి ట్రావెల్స్ డ్రైవర్ క్రాంతి కుమార్ మద్యం సేవించినట్లు గుర్తించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మియాపూర్ ట్రాఫిక్ సిఐ ప్రశాంత్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా నాయకులు

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ ఎం.రవికుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం శేరిలింగంపల్లి తహశీల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో మహిళలకు ఇచ్చిన హామీలైన మహాలక్ష్మీ స్కీంలో భాగంగా నెలకు రూ.2500, నవ వధువుకు ఇస్తానన్న తులం బంగారం, 18 ఏళ్ళు నిండి కాలేజీకి వెళ్ళే ప్రతి ఆడపిల్లకు స్కూటీ, ఐదు లక్షల విద్యార్థి హామీ కార్డులు, రూ.4 వేల పింఛన్ తదితర హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, మహిళా మోర్చా నాయకులు వరలక్ష్మీ, నవతారెడ్డి, స్రవంతి, నాయకులు రాధాకృష్ణరావు, హనుమంత్ నాయక్, రాజుశెట్టి, ఆంజనేయులు సాగర్, తిరుపతి పాల్గొన్నారు.

కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు ధాత్రినాథ్ గౌడ్

హఫీజ్‌పేట్: డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి బీఆర్ఎస్ నాయకులు ధాత్రీనాథ్ గౌడ్ బుధవారం వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలోని శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ కాలనీ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు నాగరాజు, గోపాల్, కేశవ్, బాబీ, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బస్తీవాసుల వినతి

రాయదుర్గం: నానక్‌రాంగూడ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడ ఎస్సీ బస్తీవాసులు పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని బుధవారం కలిసి వినతిపత్రాన్ని స్థానికులు అందించారు. అనంతరం బస్తీలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను, కావాల్సిన అభివృద్ధి పనులపై ఆయనకు వారు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అన్ని రోడ్లను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. బస్తీవాసులు నరేష్, మహేందర్, యాదయ్య, చంద్రశేఖర్, రవి, కమలేష్, డి.రవి, రాజు పాల్గొన్నారు.

ఖాజీపల్లికి ఆర్టీసీ బస్సు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లికి ఆర్టీసీ బస్సు వేశారు. ఇటీవల బస్సు కోసం కాలుష్య నియంత్రణ జేఏసీ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందించారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు బుధవారం ఖాజీపల్లికి బస్సును కేటాయించారు. జెడ్పీ మాజీ చైర్మన్ రామకృష్ణ, జేఏసీ చైర్మన్ దండె రమాకాంత్ ఆధ్వర్యంలో బస్సును ప్రారంభించారు. ఆర్టీసీ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీడీఎల్ సీఐగా స్వామిగౌడ్



పటాన్‌చెరు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ అన్నారు. ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌రెడ్డి హైదరాబాద్ ఐజి కార్యాలయానికి వెళ్ళగా, ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ టూ టౌన్ సీఐ స్వామిగౌడ్ బుధవారం బీడీఎల్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్వామి గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణలో ముందుంటానని తెలిపారు.

శ్మశానవాటికలో బోరు పనులు ప్రారంభం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల ముదిరాజ్ శ్మశానవాటికలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు, అన్ని కులాలకు సంబంధించిన శ్మశాన వాటికలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

'ప్రజాపాలన' సేవా కేంద్రాల ఏర్పాటు

ఉప కమిషనర్ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ –21 పరిధిలో ప్రజాపాలన దరఖాస్తుల సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఉపకమిషనర్ వంశీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ 21 పరిధిలో నాలుగు వార్డులు చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ ఉన్నాయన్నారు. వార్డు కార్యాలయంలో గురువారం నుంచి ప్రజాపాలన దరఖాస్తుల సేవా కేంద్రాలలో జీహెచ్ఎంసీ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రజాపాలన దరఖాస్తులలో ఎలాంటి మార్పులు చేర్పులు ఉన్నా చేసుకోవచ్చన్నారు. తమకు సంబంధించిన వార్డు కార్యాలయంకు వెళ్ళి దరఖాస్తులలో నెలకొన్న సమస్యలు తెలుసుకోవచ్చన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాపాలన సేవా కేంద్రం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి వార్డుకు ఒక సేవా కేంద్రం ఉందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోగలరని డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి



గోపన్‌పల్లి తండాలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజావసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు.గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి తండాలో రూ.1.50 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు, వరదనీటి కాలువ పనులను ఆయన బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతు నాయక్, తిరుపతి, శేఖర్, ప్రభాకర్, మన్నేరమేష్, ప్రసాద్, ప్రకాశ్, ప్రసాద్, శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జిన్నారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ రవీందర్‌గౌడ్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని పలుగ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన ఎంపీడీఓ అరుణతో కలసి జిన్నారం, వావిలాల, చౌదరిగూడెం, కొర్లకుంట, మాదారం, కొడకంచి, మంగంపేట్, ఊట్ల, రాళ్లకత్వ, అండూర్, శివానగర్, ఇమామ్‌నగర్ గ్రామాలలో రూ. 30 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగు రమేష్, ఎంపీటీసీలు లావణ్యనరేష్, సంతోష మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, నాయకులు సత్యనారాయణ, జయప్రకాశ్, రాజుగౌడ్, నరేందర్, జింకల రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక
- శంషాబాద్ ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ



శంషాబాద్ కమ్యూనిటీ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

శంషాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, రోగులకు సరైన వైద్యసేవలందించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మందుల పంపిణీ, ల్యాబ్ తదితర వివరాలను అడిగి తెలుసుకుని వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని, వారికి అత్యుత్తమ సేవలందించాలన్నారు. ఆస్పత్రికి అభివృద్ధికి అవసరమైన నిధులు తదిర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగమణి తదితరులు ఉన్నారు.

క్రషర్‌లను తొలగించాలి

కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే క్రషర్‌లను తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాదారం గ్రామ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ నేత రాజుగౌడ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ బిక్షపతికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్రషర్‌లతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో రెండు క్రషర్‌లు లీజ్‌గడువు ముగిసినా కొనసాగుతున్నాయన్నారు. మరో వంద ఎకరాల్లో నూతన క్రషర్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు , ప్రజలు పాల్గొన్నారు.



- పూర్తి కావవచ్చిన వంతెన నిర్మాణం
- పిల్లోనిగూడ– మక్తగూడవాసుల కల సాకారం

శంషాబాద్ రూరల్: స్థానిక ప్రజల దశాబ్దాల కల సాకారం కానుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఈ వంతెన అందుబాటులోకి వస్తే ప్రజలకు దూరభారం తప్పుతుంది. మండలంలోని పిల్లోనిగూడ శివారులో ఎంటేరు వాగుపై ఏర్పాటు చేస్తున్న కొత్తూరు మండలం మక్తగూడ గ్రామం– పిల్లోనిగూడ మధ్యన వంతెనతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో సుమారు రూ.7 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి.

వంతెన పూర్తయితే..

ఎంటేరు వాగుపై చేపడుతున్న వంతెన నిర్మాణం పూర్తయితే వాహనదారులకు దూరభారం తప్పుతుంది. కొత్తూరు, శంషాబాద్, చేవెళ్ల, షాబాద్ మండలవాసులకు ఈ మార్గం సౌకర్యంగా మారుతుంది. కాగా వర్షాకాలంలో వరదలు వస్తే ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సి ఉంటుంది. ఎంటేరు వాగుపై వంతెన కోసం ఎన్నో ఏళ్ల నుంచి స్థానికులు విన్నపాలు చేశారు. గతంలో తాత్కాలికంగా వాగులో పైపులు ఏర్పాటు చేసి రాకపోకలు సాగేలా చేశారు. అయితే భారీ వర్షాలు వస్తే పరిస్థితి మొదటికి వచ్చేది. దీంతో ఇక్కడ వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేయగా.. నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టారు. సుమారు మూడేళ్ల కిందట పనులు మొదలు పెట్టగా.. పనులు తుది దశలో ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో త్వరగా ఈ వంతెనపై రాకపోకలు ప్రారంభిస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలుగుతాయి.



పిల్లోనిగూడ శివారులో అసంపూర్తిగా రోడ్డు విస్తరణ పనులు

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం..

పాల్మాకుల గ్రామం నుంచి రాయన్నగూడ చౌరస్తా వరకు బెంగళూరు జాతీయ రహదారి–షాబాద్ రహదారిని కలుపుతూ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డుపై కంకర ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొన్నిచోట్ల రోడ్డును తవ్వి వదిలేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



రోడ్డు విస్తరణతోపాటు వంతెన పనులు త్వరగా పూర్తి చేస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలుగుతాయి. వర్షాలు వస్తే వాగు దాటలేం. వంతెనపై రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలి. – జుర్కి రమేష్ పటేల్, పిల్లోనిగూడ, శంషాబాద్

కాలనీల్లో అంధకారం

రాజేంద్రనగర్: శివరాంపల్లి, ప్రశాంత్ కాలనీ, న్యూ వీకర్ సెక్షన్ కాలనీల్లో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏడాది కొత్త లైట్లు అమర్చక పోగా పని చేయని లైట్లకు కనీసం మరమ్మతులు సైతం చేయడం లేదని వారు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు పట్టణంలోని బార్లు, లాడ్జీలో ఆర్‌జీఐఏ పోలీసులు బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నాలుగు బృందాలుగా ఏకకాలంలో వేర్వేరు ప్రాంతాల్లోని లాడ్జీలు, బార్లలో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం బృందాలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, బార్లలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఏసీపీ కె.ఎస్ రావు హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు పాల్గొన్నారు.

సత్యాగ్రహం- ప్రజాస్వామిక ప్రభావాలపై ప్రత్యేక చర్చ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వేదికగా ఈ నెల 5వ తేదీన 'గాంధేయ సత్యాగ్రహం– ప్రజాస్వామిక ప్రభావాలు' అనే అంశంపై ప్రత్యేక చర్చ జరగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా కొలంబియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్, ఇన్ఫోసిస్ ప్రైజ్ –2023 విజేత ప్రొ.కరుణ మంతెన ఉపన్యసించనున్నారు. ఈ సమావేశంలో సామూహిక నిరసనలో గాంధీ విశ్లేషణ, హింసను తిరస్కరించడానికి గల సంబంధిత అంశాల గురించి చర్చించనున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్.. జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 8 మందికి జరిమాన, ఇద్దరికి జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమ ,మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 8 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా, ఒకరికి రెండు రోజులు ,మరోకరికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు, రూ. రెండు వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.